

"పునర్జన్మా?. . . అది కేవలం మూఢవిశ్వాసం! ఆ సిద్ధాంతానికి శాస్త్రసమ్మతమైన ఆధారమేమీ లేదు" అన్నాడు శివప్రకాశ ముదలియార్. రామచంద్రపురంలోని హైస్కూలు హెడ్మాస్టరు ఆయన.

"పునర్జన్మసిద్ధాంతం మతసంబంధమైన నమ్మకమే కానీ, అది శాస్త్రం కాదు. సైన్సుకు కొన్ని విషయాలలో తావులేదు. విజ్ఞానశాస్త్ర పరిధిని పరిమితం చేస్తూ ఓ ఘనపుతెర లాంటిది ఉంటుంది. ఆ పరిధికి మించిన విషయాలలో విజ్ఞానశాస్త్రానికి ఆస్కారం లేదు. మతాన్ని అధిక్షేపించేందుకు విజ్ఞానశాస్త్రానికి కానీ, విజ్ఞానశాస్త్రాన్ని ప్రశ్నించేందుకు మతానికి కాని అధికారం లేదు." మహాలింగంపిళ్లె గట్టిగా వాదించాడు.

మహాలింగంపిళ్లె వయస్సు దాదాపు అరవై సంవత్సరాలకు పైబడి ఉంటుంది. పోలీసుఇన్స్పెక్టర్‌గా రిటైరయి, పెన్షన్ పుచ్చుకుంటున్నాడు.

"మూఢవిశ్వాసాలనీ, గుడ్డినమ్మకాలనీ ప్రోత్సహిస్తే మన దేశం నాశనమైపోతుంది. తార్కికమైన ఆలోచన లేకపోవడంమూలాన ప్రతిదీ అధోగతి పాలవుతూంది." తన అభిప్రాయం తెలియజేశాడు శివప్రకాశం.

"మతవిశ్వాసమన్నది మంచిదనీ, గుడ్డిదనీ రెండు విధాలుగా ఉండదు. ఆ నమ్మక మనేదానికి భౌతికచక్షువు లుంటాయా?. . . మనం విశ్వసించడంలో ఉంది. అంతే!"

"పోనీ, పునర్జన్మ సిద్ధాంతాన్ని బుజువు చేసే సంఘటన ఏదైనా మీ అనుభవంలో మాకారా చెప్పండి?. . . అదంతా శాస్త్రాలమీద మనకున్న మూఢభక్తి . . . కాదంటారా?"

"నీవు చిన్నవాడివి శివప్రకాశం! నీకు తెలియదు. నేను తలనెరిసినవాణ్ణి. నీకో కథ చెబుతాను విను! ఇది కథకాదు, నా అనుభవం! అప్పటికి నే వింకా సర్వీసులో ఉన్నాను" అన్నాడు మహాలింగంపిళ్లె.

"చెప్పండి! అలాంటి కథలు వినడానికి నే నెప్పుడూ సిద్ధమే." ఆసక్తిగా అన్నాడు శివప్రకాశం.

మహాలింగంపిళ్లె కథ చెప్పసాగాడు:

ఒకసారి నేను తిరుపతియాత్రకు వెళ్లాను. అక్కడ ఒక బైరాగితో పరిచయమైంది. మే మిద్దరం అనేక విషయాలమీద చాలాసేపు మాట్లాడుకున్నాం. ఆ బైరాగివేషం నా కంతగా నచ్చలేదు, కానీ అతడి మాటలతీరు నన్నాకర్షించింది. తేనెపలుకుల్లా మధురంగా, ఆప్యాయంగా ఉండిన అతడి సంభాషణతీరు నన్ను ఫలానా అని చెప్పలేని ఒక వ్యామోహపరవశుణ్ణి చేసింది.

మాట్లాడుతూ, ఉన్నట్టుండి నా చేయి చూపమని అడిగాడు. భవిష్యత్తు గురించి హస్తసాముద్రికం

---

మన కన్నీ తెలుసునని అనుకుంటాంగానీ, మన ఎరుకకు అందని విషయాలే ఎక్కువగా ఉంటాయి. మనం వెనక జన్మలో ఎవరమో తెలిస్తే ... అలాగే ఎదుటి వ్యక్తులు వెనక జన్మలో ఎవరో తెలిస్తే ... ఆ జన్మలకూ, ఈ జన్మకూ ఉన్న సంబంధం బయటపడితే... పునర్జన్మలున్నాయి కానీ, ఆ జన్మ చక్రజ్ఞానం అడుగడుగునా తెలుస్తుంటే గుండె బేజారై పోదూ!

---

తెలుగు

**'మురళీకృష్ణ'**

మూలం:

**శ్రీ సి. రాజగోపాలాచారి**

వేటాడు కాబోలునని,నా అరిచేయి చాపాను. అతడు నడుముకు చుట్టుకున్న కాషాయవస్త్రం మడతలలో నుండి ఓ చిన్నపెట్టె తీసి, అందులోనుంచి గుండ్రటి మాత్ర ఒకటి తీసి నా చేతిలో ఉంచాడు.

"మాత్ర మింగేయి!" అన్నాడు బైరాగి. నేను తటపటాయించాను.

"ఈ మాత్ర వేసుకుంటే నీ గుండెనొప్పి తగ్గుతుంది. ఏ అనుమానమూ లేకుండా మాత్ర మింగేయి!" అన్నాడతడు.

అప్పట్లో నాకు తరుచూ గుండెనొప్పి వస్తూండేది. హఠాత్తుగా గుండెలో ని నరాలన్నీ బిగుసుకుపోయినట్లు విపరీతమైన బాధ కలిగేది. ఎప్పుడో ఒకప్పుడు ఆ గుండెనొప్పి నా మరణానికి దారి తీస్తుందని డాక్టర్లు చెప్పారు. . . కానీ నా గుండెనొప్పిని గురించీ, అనారోగ్యం గురించీ ఆ బైరాగి ఎలా తెలుసుకోగలిగాడా? అని ఆశ్చర్యపోయాను. మా సంభాషణలో ఆ సంగతి నేను చెప్పలేదు. బహుశా అతడు నా ముఖ కవళికల్నిబట్టి గ్రహించి ఉండాలి.

"సందేహించకు! మాత్ర నోట్లో వేసుకుని చప్పరించి, మింగేయి!" అని మళ్లీ అన్నాడు బైరాగి.

మాత్ర నోట్లో వేసుకుని చప్పరించాను. భరించరానంతటి చేదుగా ఉంది, కానీ ఎలాగో తట్టుకుని అతడి వైపు చూశాను. అప్పుడు సుమారు మధ్యాహ్నం మూడు గంటలయి ఉంటుంది. ఎండ బాగా తీక్ష్ణంగా ఉంది. ఆ బైరాగి పొడుగాటి నీడ కింద రాయిమీద పడింది. ఒక్కసారి ఆ నీడవైపు చూసిన నేను ఆశ్చర్యపోయాను. బైరాగి ఆకారంలో లేదు ఆ నీడ! ఇరవై సంవత్సరాల క్రితం చనిపోయిన మా అమ్మ రూపం కనిపించింది ఆ నీడలో!

"అమ్మా!. . ." అంటూ పెద్దగా కేకవేసి, అచేతనంగా నిలబడిపోయాను. . .

. . . నాకు స్పృహ వచ్చేసరికి, బైరాగి అక్కడే నా ఎదట నిలుచుని ఉన్నాడు. "గుండెనొప్పి తగ్గిందా?" అని అడిగాడు.

ఏమీ మాట్లాడలేక, తగ్గిందన్నట్లు తల ఊపాను.


"ఈ జన్మలో నే నీ శరీరంలో ఉన్నాను. నేను పూర్వజన్మలో ఏ రూపంలో ఉన్నదీ ఇప్పుడు నీవు ఆ మాత్ర ప్రభావంవల్ల చూడగలిగావు!. . . తల్లి ఎవరు? కొడుకు ఎవరు?. . . కదిలి నేను మరుగయిపోయే నీడలతో కూడినదే తప్ప ఈ ప్రపంచంలో శాశ్వతమైనది ఏదీలేదు. అనంతమైనదీ, నిజమైనదీ ఆత్మ ఒక్కటే! ఆ పదార్థం ఒక్కటే ఎన్ని రూపాలలోనో అవతరిస్తూ ఉంటుంది. . . గాభరాపడకు! ఇదుగో, ఈ మాత్రలు తీసుకో!" అని నా చేతిలో మరో నాలుగు మాత్రలు పెట్టాడు.

"నీ గుండెనొప్పి తగ్గడానికి ఈ మందు బాగా పనిచేస్తుంది. మరీ అవసరమైనప్పుడు తప్ప వీటిని ఉపయోగించవద్దు. విపరీతమైన బాధ కలిగినప్పుడు ఒక మాత్ర చప్పరించి, మింగేయి! నొప్పి తగ్గిపోతుంది. కానీ, ఒక్క మాట! ఈ మాత్ర నీ నోటిలో ఉన్నంతసేపు నీ ఎదటిప్రాణుల నీడలో వారి పూర్వజన్మపు రూపాలు కనిపిస్తాయి. భయపడవద్దు! గత జన్మ, మరుజన్మ నీడలాగా వెంటనంటి ఉంటుంది." వివరంగా చెప్పాడు బైరాగి.

మాత్రలు తీసుకుని, జేబులో వేసుకున్నాను.


# నిరాటంకమైన వంట
# కాల్‌గ్యాస్‌తో
# ఆరంభం-తక్షణం

చాలా ఎక్కువ మంది గృహిణులు నిరాటంకంగా వంట చేయుటకు కాల్‌గ్యాస్ వాడుతున్నారు. మీ రెందుకు వాడగూడదు ?
కాల్‌గ్యాస్ మీ వంటింట్లో వున్నదా, మీ వంటలో చిక్కులు మటుమాయం. ఎందుకంటే అది తక్షణం వెలుగుతుంది. వెంటనే వేడెక్కుతుంది. మరి వంటే సమయాన్ని తగ్గిస్తుంది. ఎంతో పరిశుభ్రం కూడా - మసి వుండదు - పొగ పట్టదు, అంట్లు తోముకొనే శ్రమ లేదు.





కాల్‌టెక్స్ వారి ఉత్పత్తి

**కాల్‌గ్యాస్ సురక్షితమైనది . . .**
కాల్‌గ్యాస్ మీ వద్దకు జాగ్రత్తయిన స్టీల్ సిలిండర్లలో వస్తుంది.
మీ వంటింట్లోకి చేర్చబడుతుంది.
**ఇంటికి వచ్చియిచ్చు సర్వీసుగలదు.**
సోల్ డిస్ట్రిబ్యూటర్లు : ఈస్ట్ కోస్ట్ గ్యాస్ కో. 48-9-5, కో-ఆపరేటివ్ కాలనీ, ద్వారకానగర్ విశాఖపట్నం-4, టెలిఫోను: 3516. కన్నెమరా ఎనెక్సు, మౌంట్ రోడ్, మద్రాస్-2. టెలిఫోను: 83488.
ఏజెంట్లుగలస్థలాలు : మద్రాస్, కాకినాడ, విశాఖపట్నం, విజయవాడ, ఏలూరు, గుంటూరు,పాలకొల్లు,రాజమండ్రి, నెల్లూరు, విజయనగరం, మచిలీ పట్నం, సేలమ్, కాట్‌పాడి, ఒంగోలు, వరంగల్, పాండిచెరీ, కాంచీపురం కర్నూలు, చిత్తూరు, తిరుపతి, బొబ్బిలి, పార్వతీపురం, రామచంద్రపురం, సోంపేట, బెరహంపూర్, నర్సారావుపేట, శ్రీకాకుళం, గుడూరు, మైసూర్, ఖమ్మమ్, ఈరోడ్, భువనేశ్వర్, కటక్, పూరి,బంగళూర్

C.GAS.G.9 TL

**ఇంకా పొడుగు ఎదగండి**



నూతన శాస్త్రపద్ధతులలో వ్యాయామములతో ఎక్కువ పొడుగు కండి. ఆరోగ్యవంతులవండి. స్త్రీ పురుషులకు ఎల్లరకు అనువైనవి. దీని వంటి కోర్సు, లేక పుస్తకం మరొకటి ఎంతమాత్రంలేదు. వివరములు ఇంగ్లీషులోగాని తెలుగులోగాని ఉచితం.

TOTAL HEALTH,

**ఏజంట్లు కావలెను**

100% టెరిలిన్ షర్టు ముక్కలు, పాంట్ ముక్కలు, పీసెలకు కమిషను లేక రు. 225/- మంచి రు. 475/- వరకు జీతము మీద ఏజంట్లు కావలెను. షరతులకు, పూర్తినిడివి సైజు ఉచిత శాంపిలుకు వ్రాయండి:

SHAKTI AGENCIES (WAP)
Qutab Road, Delhi-6.

**ఐటెక్స్**
సౌందర్య సాధనములు

ఐటెక్స్ కాటుక   ఐటెక్స్ బిందీ తిలకం
ఐటెక్స్ కుంకుం పేస్టు




ARAVIND LABORATORIES
P. B. 1415., MADRAS-17

"ఈ నాలుగు మాత్రలు వేసుకున్న తరవాత, నీ గుండెనొప్పి పూర్తిగా తగ్గిపోతుంది. తొంభైఏళ్ల వరకు నవ్వను పుచ్చుకుంటూ హాయిగా బ్రతుకుతావ్" అని ఆశీర్వదించి, ముందుకు నడిచి జనంలో కలిసిపోయాడు.

• • •

ఆ తరవాత చాలాకాలంవరకు గుండెనొప్పి తీవ్రంగా రాలేదు. బైరాగి ఇచ్చిన మాత్రల విషయం దాదాపుగా మరిచిపోయాను.

ఒక రోజు మధ్యాహ్నం, నేను నిద్రలేచాక తాగడం కోసం నౌకరు టేబుల్‌మీద పెట్టిన పాలు పిల్లి తాగివేసింది. పాలకప్పు కిందికి తోసి, పిల్లి పరుగెత్తింది. ఆ చప్పుడుకి తక్కువ మెలకువ వచ్చింది. పాలగ్లాసు తోసి వెడుతున్న పిల్లిమీద విపరీతమైన కోపం వచ్చింది. వెంటనే పడకమీదినుంచి లేచాను.

నిద్రలోనుండి హఠాత్తుగా లేవడం, పిల్లిని అదిలించాలని కోపంగా ముందుకు దూకడం, వీటివల్ల కలిగిన ఉద్రేకంతో విపరీతమైన గుండెనొప్పి వచ్చింది. అలాగే కుర్చీలో కూర్చుండిపోయాను. సుమారు పావుగంట సేపు అలాగే బాధపడ్డాను. బైరాగి ఇచ్చిన మాత్రల విషయం అప్పుడు జ్ఞాపకం వచ్చింది. మాత్రలపొట్లం తీసి, అందులోనుండి ఒకటి నోట్లో వేసుకున్నాను. పిల్లి మెల్లగా నా పక్కకు వచ్చింది. అప్పటికి నేను కొంచెం సర్దుకున్నాను. పిల్లిమీద కోపం పోయింది. మాత్ర చప్పరించేకొద్దీ ఒంట్లో చలిచలిగా ఉన్నట్లు అనిపించడంతో, వెచ్చదనం కోసం మెల్లిగా వరండాలోకి వచ్చి ఎండలో నిలుచున్నాను. "మ్యావ్, మ్యావ్" అంటూ నా వెనకనే వచ్చింది పిల్లి. వెనక్కి తిరిగి పిల్లివైపు, వరండాలో పడిన పిల్లినీడవైపు చూశాను.

వెంటనే, వంగి కూర్చుని రెండు చేతులతో పిల్లిని దగ్గిరికి తీసుకుని ముద్దు పెట్టుకున్నాను. పిల్లి నీడలో నేను చూసిన రూపం ఏమిటో తెలుసా?. . . చిన్నవయసులోనే చనిపోయిన నా భార్య! 'నీవా నా పాలు తాగావు!' అనుకున్నాను.

ఆ క్షణంలో నాలో కలిగిన అనుభూతిని, ఆనందాన్ని ఎలా చెప్పను? ఎవరితో చెప్పగలను?

• • •

జాగ్రత్తగా దాచిన మూడు మాత్రలలో నుండి ఇంకో మాత్ర తీసి, నోట్లో వేసుకుని చప్పరిస్తూ పిల్లినీడవైపు చూశాను. ప్చ్! ప్చ్! నాకు కనిపించింది పిల్లినీడ మాత్రమే కానీ, నే నెంతగానో ప్రేమించిన మా ఆవిడ రూపంకాదు. చాలా నిరుత్సాహపడిపోయాను. "ఏ ప్రాణికి సంబంధించిన పూర్వజన్మపు రూపాన్ని ఐనా ఒక్కసారి మాత్రమే చూడగలవు! వెనువెంటనే మరోమాత్ర వేసుకున్నా గతజన్మరూపాన్ని మరోసారి చూడలేవు" అని బైరాగి చెప్పిన మాటలు గుర్తువచ్చాయి.

ఆ నాటినుండీ ఆ పిల్లిని కేవలం ఒక జంతువుగా చూడలేకపోయాను. దాని చూపులు, గొంతుక, అన్నీ అదృశ్యంగా ఉన్న నా భార్యవిగా తోచేవి.

ఆ సంఘటన జరిగాక, దాదాపు ఒక సంవత్సరం తరవాత జబ్బుచేయడంవల్ల పిల్లి చనిపోయింది. పిచ్చివాడిలాగా ఏడ్చాను. ఇంటివెనక ఖాళీస్థలంలో గొయ్యి

తీసి, దానిని పూడ్చిపెట్టాను. ఆ గొయ్యిమీద ఒక వేపమొక్క నాటి, ఎప్పుడో చనిపోయిన నా భార్యను ఆ వేపచెట్టు రూపంలో చూసుకుని తృప్తి పడేవాణ్ణి. . . . . . కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి.

నాకు వచ్చే ఆదాయంలోనుంచి చాలా వెనక వేశాను. డబ్బు చేరేకొద్దీ, డబ్బుమీద ఆశ మరింత అధికమవడం సహజం. అలా కూడబెట్టిన డబ్బంతా దురదృష్టవశాత్తూ విశ్వనాథన్ అనే ఒక దుర్మార్గుడికి ఇచ్చాను. నే నిచ్చిన డబ్బుకు అధికమైన వడ్డీ ఇస్తానని నన్ను ప్రలోభ పెట్టాడు. కాని అతడు చివర మోసం చేసి పారిపోతాడని నేను గ్రహించలేకపోయాను.

మా పోలీసు అధికారుల సహాయంతో అతడి కోసం వెదికి వెదికి ఎలాగో పట్టుకోగలిగాను. అతడు దొరికితే అరెస్టు చేయకుండా నా వద్దకు తీసుకు రమ్మని చెప్పడం వల్ల, విశ్వనాథాన్ని నా దగ్గిరికి తీసుకువచ్చారు. అతడి నుంచి ఎలాగైనా డబ్బు తిరిగి రాబట్టాలని ప్రయత్నించాను.

"నేను చేసింది తప్పే! క్షమించండి! మిమ్మల్ని మోసం చేయాలని లేదు. కాని పరిస్థితుల ప్రాబల్యంవల్ల ఇంట్లోవాళ్ల ఒత్తిడిచేత, ప్రోత్సాహంచేత అలా చేయవలసి వచ్చింది" అంటూ కష్టసుఖాలు ఏకరువు పెట్టడం మొదలెట్టాడు విశ్వనాథన్.

అతడిమీద పట్టరాని ఆగ్రహం కలిగింది నాకు. ఆవేశంతో ఊగిపోతూ, కాలిచెప్పు తీశాను, అతణ్ణి కొట్టుదామని! వెంటనే విశ్వనాథన్ పరిగెత్తిపోయాడు. పోలీసులు వెంటబడి తరిమి, పట్టుకు వచ్చారు. నాలుగడుగులు వేసేలోగా ఆ ఉద్రేకంవల్ల, ఆవేశంవల్ల మళ్లీ విపరీతమైన గుండెపోటు వచ్చింది. భరించరానంత బాధ వేసింది. బైరాగి ఇచ్చిన మాత్రల పొట్లంలోని ఓ మాత్ర తీసి నోట్లో వేసుకుని, వరండాలోఉన్న ఆ దుర్మార్గుడివైపు నడిచాను. అతడి వైపు వెడుతూ, యధాలాపంగా విశ్వనాథన్ నీడకేసి చూసిన నేను చలించిపోయాను! అతడి నీడలో నేను చూసింది ఎవరి రూపమో తెలుసా?. . . మా నాన్న! తలతిరిగిపోయినట్లయింది. 'మా నాన్నే నన్ను మోసం చేశాడా? నేను నా పితృ ఋణాన్ని ఇలా తీర్చుకోవాలా?' అనిపించింది.

"ఈ వెధవను పోనివ్వండి! అతడు చేసిన మోసం అతడినే నాశనం చేస్తుంది" అని గట్టిగా కేకవేసి, అక్కడ ఉండలేక లోపలికి వచ్చాను. మా నాన్నరూపం చూడగానే, నేను చిన్నప్పుడు మా నాన్నపట్ల చేసిన దుష్కర్మలన్నీ ఒక్కసారి జ్ఞాపకం వచ్చాయి.

. . . ఆ తరవాత కొన్నాళ్లకు నన్ను రామనాథపురం జిల్లాకి బదిలీ చేశారు. అప్పట్లో అక్కడ అల్లర్ల మూలంగా శాంతిభద్రతలు లేకుండా ఉండేది. రెండు వర్గాలవారు ఎప్పుడూ ఒకరితో ఒకరు కలహించుకుని హత్యలు చేసుకోవడం, గృహదహనాలు చేయడం విపరీతంగా ఉండేది. పోలీసుఅధికారులని ఇది కలవరపరిచింది. ఇరువర్గాల సంఘర్షణను అణిచివేసి, శాంతి నెలకొల్పడానికి ఎన్నోవిధాల పాటుపడ్డారు డిపార్టుమెంటువారు. ఎలాగో కొన్ని రోజులకి పరిస్థితిని అదుపులోకి తీసుకురాగలిగాము.

అప్పుడు నేను శాతంకుళమ్‌లో ఉండేవాణ్ణి. ఏదో హత్యాప్రయత్నం మీది కేసువిచారణకుగాను, జిల్లాకలెక్టరుక్యాంపుకు వచ్చారు. ఒక ఆదివారంనాడు


# కాశ్మీర్ బొకె టాల్కుతో గంటల తరబడి పరిమళవంత ముగాను తాజాగాను వుండండి

పూలవలె తాజాగాను పరిమళంగాను వుండే కాశ్మీర్ బొకె టాల్కు మిమ్మల్ని సువాసనలతో నింపుతుంది. దాని చల్లదనాన్ని, పూలరేకులంలాంటి మృదు స్పర్శను. మనోరంజకమైన పరిమళాన్ని మీ చుట్టు ప్రక్కలంతా అనుభవించండి. గంటల తదనంతరం కూడా ఎక్కువ సేపు నిలచే కాశ్మీర్ బొకె టాల్కు పరిమళము పూల మేఘము వలె మిమ్మల్ని ఆవరించి నట్లుగా అనుభూతిని పొందుతారు.

కాశ్మీర్ బొకె టాల్కు అత్యుత్తమంగా సౌందర్యపరచే టాల్కు మాత్రమే కాదు, అది బిడ్డలకొరకు కూడా అద్భుతమైనది. మీ ఇద్దరూ ఉపయోగించగల ఒకే పౌడర్ అందుబాటులో ఉండడం చాలా వీలు.




CB.Q.21 TL

# కాశ్మీర్ బొకె

పురుషులు ఇష్టపడే పరిమళమైన టాల్కం పౌడరు

కాల్గేట్ వారి ఒక నాణ్యమైన ఉత్పత్తి

ఉదయం ఊరిపక్కనే ఉన్న చెరువు ఒడ్డుకు వేటకు వెళదామని కలెక్టరుగారన్నారు. నేను శుద్ధశాకాహారిని! కానీ కలెక్టరుగారి ఆహ్వానాన్ని కాదనడమెలా? సరేనని, కూడా వెళ్ళాను.

ఉదయం పది గంటలకు కాఫీ, టిఫిన్ ముగించి బయలుదేరాము.

కలెక్టరుగారు ఒకటి, రెండు పక్షులను కొట్టారు. నీటిఒడ్డునే ఉన్న ఒక బాతుకు గురిచేసి తుపాకి పేల్చాను. గిలగిల తన్నుకుంటూ పక్కనే ఉన్న పొదలో వెళ్ళిపడింది బాతు. మాతోబాటు వచ్చిన నౌకరు పొదలోనుండి బాతును తెసుకువచ్చాడు. బాతుకి ఒక రెక్క పూర్తిగా దెబ్బ తినింది. బాధతో గిలగిల కొట్టుకుంటూంది. నా చేతులారా ఓ జీవిని కాల్చిచంపడం అదే మొదటిసారి! దాని కళ్లవైపు చూశాను. నా మనస్సు కుంగిపోయింది. చెప్పలేని మానసికవేదన కలిగింది.

"మా నిషాద ప్రతిష్ఠాంత్వ మగమః శాశ్వతీస్సమాః"

( ఓ హంతకుడా! నీ జీవితాంతం సుఖశాంతులు లేకుండుగాక! )

వాల్మీకి చెప్పినట్లు ఆ పక్షి వేటగాడి కిచ్చిన శాపం నాకు వర్తిస్తుందా? అన్నట్లు అనిపించింది.

ఆ రోజు ఉదయంనుండీ నా మనసు అంతగా బాగులేదు. ఏ క్షణంలోనైనా గుండెపోటు వస్తుందేమోనని భయంకూడా వేసింది. అందుకే బైరాగి ఇచ్చిన మాత్రకూడా తెచ్చుకున్నాను. మధ్యాహ్నానికి వేట ముగించి, పల్లెకు తిరుగుప్రయాణం మొదలు పెట్టాము. కొట్టినబాతును, పక్షులను ఓ పొడుగాటి వెదురుకర్రకు కట్టి, భుజంమీద మోసుకుంటూ మా ముందు నడిచాడు నౌకరు. అతడి వెనకనే నేను, కలెక్టరుగారు, తదితరులు నడవసాగాము.

కొంతసేపటికి గుండెనొప్పి ఉధృతంగా వచ్చింది. భరించలేకపోయాను. నడవలేక నేలమీద కూలబడ్డాను. నొప్పి తట్టుకోలేక, జేబులోని చివరిమాత్ర తీసి నోట్లో వేసుకున్నాను. ముందు నడుస్తున్న నౌకరు వెనక్కి తిరిగి నా దగ్గిరికి వచ్చి, "ఏమైంది సార్?" అని అడిగాడు. అతడి నీడ నా ముందు పడింది. కాని నే నది గమనించలేదు. అతడి భుజంమీద ఉన్న, వెదురు చివర కట్టబడిఉన్న బాతు పీటి నీడమీద నా దృష్టి పడింది. నేను చంపిన ఆ బాతునీడ చూచేసరికి, నా దుఃఖానికి మితిలేకపోయింది. ఎంత బాధపడ్డానో చెప్పలేను.

నా భార్య చనిపోయాక, ఆమె స్మృతి చిహ్నంగా ఒక్కగానొక్క అమ్మాయి మిగిలింది. ఆ బిడ్డ ఆట పాటలు, ముద్దుమురిపాలు చూచుకుని ఆ సంతోషంలో చనిపోయిన నా భార్యని గురించిన దుఃఖాన్ని కొంతవరకు మరిచిపో గలిగాను. ఆ పాపకు తల్లీ—తండ్రీ నేనే అయి పెంచాను. కానీ అమ్మాయికి నాలుగో ఏడు జరుగుతున్నప్పుడు జబ్బు చేసింది. బిడ్డను దక్కించుకోవాలని ఎంతగానో శ్రమపడ్డాను. ఒకనాటి రాత్రి దాదాపు అపస్మారక స్థితిలో నన్ను దగ్గిరికి పిలిచింది.

"నాన్నా!" అంది.

"ఏం తల్లీ!" అని దగ్గిరగా కూర్చున్నాను.

"నన్నెవరో కాళ్ళు, చేతులు కట్టి లాక్కెడుతున్నారు నాన్నా!" అంది బాధగా.

"భయపడవద్దమ్మా! ఇక్కడెవరూ లేరు" అని ప్రేమగా ముద్దు పెట్టుకున్నాను. కానీ ఆ మరు ఉదయమే శాశ్వతంగా నన్ను విడిచి వెళ్ళిపోయింది. . .

. . . నా ముందు కన్పించిన బాతు నీడలో నేను చూసింది ఎవరినో కాదు, నా బిడ్డనే! సుకుమారమైన ఆ చిన్నారి కాళ్లను వెదురుకు కట్టి వ్రేలాడదీసినట్లు కనిపించింది. ఆ కళ్లలో నా మీద కోపం లేదు. ఎంతో ఆప్యాయంగా, ప్రేమగా నా వైపు చూస్తున్నట్లు తోచింది. విపరీతమైన జ్వరంతో ప్రాణం పోయే ముందు జాలిగా నా వేపు చూసిన కళ్ళు, పక్షిరూపంలో నా ముందు దృగ్గోచరమైంది.

"అమ్మా!. . . బేబీ!. . ." గట్టిగా కేకవేశాను.

"ఏమిటి ఇన్స్పెక్టర్! ఏమైంది?. . ." అంటూ కలెక్టరుగారు అడిగారు.

"ఏం లేదు! ఏం లేదు!..." అని నేలమీదనుండి ఏడుస్తూ లేచి నిలుచుని, మరోసారి పక్షినీడవైపు చూశాను. ఆ నీడలో బిడ్డరూపం చెరిగిపోయింది. అప్పటికి బాతుప్రాణం విడిచింది.

అందరితోబాటు ముందుకు నడిచాను. కొంతసేపటికి గుండెల్లో నొప్పి తగ్గింది. కానీ నా చేతులారా మరోసారి నా బిడ్డప్రాణాలు తీశాను! నేను చేసిన పాపానికి ఏ శిక్ష అనుభవించినా చాలదన్నబాధతో ఎంతో కుమిలిపోయాను.

• • •

ఒకనెల జరిగింది. గ్రామంలోని రెండు వర్గాలమధ్య సఖ్యత నెలకొనింది. అందరూ కలిసి పెద్దమీటింగు ఏర్పాటు చేశారు. ఆ సభకు నన్నూ పిలిచారు.

సభలో ఓ వృద్ధుడు మాట్లాడుతూ, "మనం ఒకరితో ఒకరు కలహించుకోవడంలో అర్థం లేదు. అంతా సోదరులం! జరిగిందేదో జరిగింది. గతాన్ని మరిచిపోదాం!. . . దైవాజ్ఞను మనం మీరలేము" అన్నాడు.

రెండో వర్గంలోని ఒక వృద్ధుడు లేచి, "మనం గతజన్మలో ఎవరమో తెలీదు. రాబోయే జన్మలో ఎవరమో అంతకన్నా తెలీదు. అలాంటప్పుడు ఎవరు ఏ కులానికి, ఏ వర్గానికి చెందినవారని ఎలా చెప్పడం? అంతా భగవంతుడి బిడ్డలం! మనలో మనం పోట్లాడుకోవడమెందుకు?" అన్నాడు.

బైరాగి నాకు ఇచ్చిన మాత్రల సహాయంతో నేను చూచినదీ, ఇప్పుడీ వృద్ధుడు చెప్పినదీ ఒక్కటిగానే తోచింది. అక్షరజ్ఞానంకూడా లేని ఆ పల్లెటూరిరైతు చెప్పిన సత్యాన్ని నేను నా కళ్లతో ప్రత్యక్షంగా చూడగలిగాను. ఈ విషయాన్నే సభలో నలుగురికీ చెపుదామనిపించింది. కాని బైరాగి ఇచ్చిన మాత్రలు ఐపోయాయి. అలాంటప్పుడు నేను చెప్పేది ఎవరూ నమ్మకపోవచ్చు! అందుచేత ఊరుకొన్నాను. . .

. . . ఆ మరుసటి నెలలో సెలవు పెట్టి తిరుపతికి వెళ్లాను. ఆ బైరాగి కోసం నలుమూలలా గాలించి వెదికాను. కాని అతడు కనిపించలేదు.

• • •

"శివప్రకాశం! మనకన్నీ తెలుసుననుకొంటాము గానీ, మన ఎరుక అందని విషయాలు ఎన్నో ఉన్నాయి" అని ముగించాడు మహాలింగంపిళ్లె.

"అవును!" అని మహాలింగం పిళ్లె వాదాన్ని ఒప్పుకున్నాడు హెడ్మాష్టరు శివప్రకాశం. ★

